డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

డిఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు గానూ బేస్మెంట్ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. బేస్మెంట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఈనెల 7లోగా డిఇఒ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆ ప్రకటనలో ఆమె సూచించారు.

కనుమరుగు కానున్న బడిదేవరకొండ

- యంత్రాలను అడ్డుకున్న గ్రామస్తులు
- ఆందోళనకు సన్నద్ధమవుతున్న ప్రజలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని కె.ములగ పంచాయతీ పరిధిలోని ప్రఖ్యాతిగాంచిన బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు గనులు భూగర్భ శాఖ అనుమతులు మంజూరు చేయడంతో భవిష్యత్తులో ఈ కొండ కనమరగయ్యే పరిస్థితి నెలకొంది. అనుమతులు పొందిన సంస్థ గ్రానైట్ తవ్వకాలకు ఉపక్రమించడంతో ఆరు పంచాయతీ ప్రజలకు ఆరాధ్య దైవమైన బడిదేవరకొండ కనుమరుగు కానుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల రెండు రోజుల క్రితం తవ్వకాలకు వచ్చే వాహనాలను ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. తమ జీవనాధారమైన కొండ కనుమరుగైపోతే పరిస్థితి అగమ్యగోచరం కానుడడంతో పోరాటానికి ప్రజలు కార్యోన్ముఖులవుతున్నారు.

బడిదేవర కొండపై తవ్వకాలకు 2006లో లైసెన్సు పొందిన ఎంఎస్‌పి గ్రానైట్ సంస్థ అప్పట్లో క్వారీ తవ్వకాలకు ప్రయత్నించగా సదరు భూమి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఉందని అటవీ శాఖ అభ్యంతరాలతో వెనుక్కు తగ్గింది. మళ్లీ సదరు సంస్థ 2016లో జాయింట్ సర్వేకు దరఖాస్తు చేసుకోవడంతో అప్పట్లో కేంద్ర ప్రభుత్వానికి చెందిన సర్వే సంస్థలు, మైనింగ్ అటవీ శాఖ అధికారులతో సంయుక్తంగా సర్వే నిర్వహించారు. 2017లో అటవీశాఖకు చెందిన ఉన్నత అధికారి ఎంఎస్‌పి సంస్థ యజమాని నుండి లంచాలు స్వీకరిస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడి చేసి అధికారిని సస్పెండ్ చేయడం కూడా జరిగింది. అనంతరం జరిగిన పరిణామాల్లో ఎమ్మెస్పీ సంస్థ సుప్రీంకోర్టులో కేసు వేయగా, ఇటీవల ఆ సంస్థకు అనుకూలంగా కోర్టులు తీర్పు వచ్చింది. అప్పట్లో పొందిన అనుమతులను మళ్లీ రివైవ్ చేసుకుని తాజాగా కొండపై తవ్వకాలకు సమాయత్తమవుతుంది. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారి శ్రీనివాసరావును ప్రశ్నించగా, కోర్టు ఉత్తర్వుల ప్రకారం ములగ పంచాయితీలోని బడిదేవరకొండపై సదరు సంస్థ మైనింగ్ చేసుకునేందుకు అనుమతులు కోర్టు ఉత్తర్వుల ప్రకారం పునరుద్ధరించడం జరిగిందని, తెలిపారు. అనుమతులు పొందిన ఎంఎస్‌పి సంస్థ రెండు రోజుల క్రితం తవ్వకాలకు సంబంధించిన భారీ యంత్రాలను, వాహనాలను మైనింగ్ ప్రాంతంలో తరలిస్తుండడంతో స్థానికులు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో భారీ వాహనాలను ములగ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిలిపివేశారు. చిన్నప్పటికి రెండు, మూడు రోజుల్లో ఇంకా మరిన్ని వాహనాలను తరలించి మైనింగ్ సంస్థ తనకున్న అనుమతులు ప్రకారం గ్రానైట్ తవ్వకాలను ప్రారంభించడానికి ఉపక్రమించబోతుందని సమాచారం. అయితే బడిదేవరకొండపై ఉన్న అమ్మవారిని పెదబొండపల్లి, సంగంవలస, ఎమ్మార్ నగరం, ములగ, డోకిశిల, తాళ్ల బురిడితోపాటు ఒడిశాకు చెందిన పలు గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా కొలిచి ప్రతి ఏటా ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఇప్పుడు బడిదేవరకొండపై తవ్వకాలు జరిపి కొండను కనుమరుగు చేస్తే అమ్మవారికి అపచారం జరుగుతుందని, అంతేకాక గ్రామ ప్రాంతాలన్నీ బడుదేవర కొండపై వచ్చే వర్షపు నీటితో సాగు నీరు కరువై పంటలకు నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అన్ని గ్రామ ప్రజలు సమావేశమై ఆందోళనకు సన్నద్ధం కానున్నారు.

గ్రామాల్లో నిలిచిపోయిన భారీ వాహనాలు

చివరి ఆయకట్టుకు సాగునీరు

మంత్రి సంధ్యారాణి హామీ • పెద్ద గెడ్డ నీరు విడుదల

ప్రజాశక్తి - పాచిపెంట

చివరి ఆయకట్టు భూములకు సాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంట సమీపాన గల పెద్దగెడ్డ జలాశయం నుంచి సాగునీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దగెడ్డ జలాశయం ద్వారా పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మూడు మండలాలకు సుమారు 12,500 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకొని మెరుగైన దిగుబడులు సాధించాలని కోరారు. అలాగే సకాలంలో ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రూ.28.18 కోట్ల జైకా నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో ప్రాజెక్టు ఆధునీకరణ పనుల్లో భాగంగా సుమారు రూ.1.47 కోట్ల రూపాయల ఖర్చు చేసి 10 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని ఆమె చెప్పారు. ఈ పనిలో భాగముగా కాలువల్లో 27.40 కి మీ కాంక్రీటు లైనింగ్ కు గాను సుమారుగా 2.50 కి.మీ. కాంక్రీటు లైనింగ్ పనులు చేపట్టామన్నారు. ఈ నిర్మాణ పనులు పూర్తి చేయడం వలన చివర ఆయకట్టు భూములకు పుష్కలంగా సాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. ముఖ్యంగా ఐటిడిఎ ద్వారా పెద్దగెడ్డ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు పించన్లు పంపిణీ చేశారు.



పెద్దగెడ్డ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

గ్రామాభివృద్ధికి రోడ్లు, కాలువలు, ఇంటింటికీ కుళాయిలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఇ వై.రాజరాజేశ్వరి, ఇఇ ఆర్.అప్పల నాయుడు, టిడిపి రాష్ట్ర నాయకులు ఆర్‌పి భంజ్‌దేవ్, మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, నిమ్మాది చిట్టి, పరమేష్, గూడెపు యుగంధర్, పి.నరసింగరావు, ముఖీ సూర్యనారాయణ, పి.ఉమా, కొత్తల పోలినాయుడు, చల్లా కనక, పి.సంతోషి పలువురు నాయకులు, కార్యకర్తలు, ఇంజనీరింగ్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాసంఘాల వినతి

పెద్దగెడ్డ జలాశయం వద్ద నీరు విడుదల చేసిన సందర్భంగా మంత్రి సంధ్యారాణికి ప్రజా సంఘాల నాయకులుకోరాడ ఈశ్వరరావు (సిఐటియు), జర్నీ రామయ్య (గిరిజన సంఘం), బి.జోగారావు (నిర్వాసితుల సంఘం), బి.గౌరి నాయుడు (రైతు సంఘం) వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దగెడ్డ జలాశయంలో సకాలంలో చేప పిల్లల పంపిణీ చేయాలని, గిరిజన మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, వలలు ప్రమాదాలు జరగకుండా అధునాతకమైన పరికరాలను సబ్సిడీ ద్వారా అందించి ఆదుకోవాలని అన్నారు. ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించి మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. పిల్ల కాలువల్లో పూడికలు తీసివేసి సక్రమంగా నీరు సాగు పంటలకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జై నిధులను సక్రమంగా ఖర్చుపెట్టి కూడుకులు తీయించే పని చేయకపోవడం వల్ల రైతులు నష్టపోయారని, కావున ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

'అటల్ మారథాన్'లో జిల్లా ప్రాజెక్టుకు గుర్తింపు

ప్రజాశక్తి - సీతంపేట

అటల్ మారథాన్ కాంపిటీషన్స్‌లో జిల్లా ప్రాజెక్ట్ కు గుర్తింపు లభించింది. 2023-24 సంవత్సరానికి అటల్ టింకరింగ్ లాబ్స్ (ఎటిఎల్)కు సంబంధించి అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఎఐఎం) నిర్వహిస్తున్న అటల్ మారథాన్ పోటీల్లో మండలానికి చెందిన పూతికవలస ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల 261 స్థానాన్ని కైవసం చేసుకుంది. డిజాస్టర్ మేనేజ్మెంట్ థీమ్‌లో ఎర్త్ క్వేక్ ఇండికేటర్ అనే ప్రాజెక్టు జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది తరువాత స్థాయికి అర్హత సాధించింది. దేశంలో గల అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి ఆన్ లైన్ లో పోటీపడిన ప్రాజెక్టుల్లో జాతీయ స్థాయిలో మొదటి 500 ప్రాజెక్టుల్లో ఇది ఎంపికైంది. ప్రాజెక్టును రూపకల్పన చేసిన విద్యార్థిని అభితకు, గైడ్ టీచర్ హేమలత, ప్రధానోపాధ్యయులు శారదకు డిఇఒ జి.పగడాలమ్మ విద్యార్థి అభిత, అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయిలో నిలపడానికి సహాయ సహకారాలు అందించిన జిల్లా సైన్సు అధికారి లక్ష్మణరావును ప్రత్యేకంగా అభినందించారు.

పోలీసు క్వార్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

జిఒ 3, ఇతర సమస్యలపై తీర్మానాలు చేయాలి

ఆదివాసీ ఉత్సవాల్లో గిరిజన సంఘాలు చర్చించాలి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల ముందు టిడిపి గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు కోసం రానున్న ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలల్లో గిరిజన సంఘాలు తీర్మానాలు చేయాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. గురువారం తన నివాసంలో గిరిజన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగష్టు 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ ఉత్సవాల సందర్భంగా గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ తీర్మానాలు చేయడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఆ తీర్మానాలను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు అందజేయాలని సూచించారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తామనిఇచ్చిన హామీ టిడిపి ప్రభుత్వం దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకి, బెంతు మిరియాలను ఎస్టీ జాబితాలో చేరవేస్తూ చేసిన అసెంబ్లీ తీర్మానం రద్దు చేయాలన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న అనేక గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాల జాబితాలో చేర్చాల్సిన అవసరం వుందన్నారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ నియోజకవర్గంలోనే వుండాలని డిమాండ్ చేయాలన్నారు. ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించుకునే సందర్భంలో గిరిజన సంఘాలు ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తీర్మానాలు చేయాలన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ ఉత్సవాలు

గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించాలని రాజన్నదొర కోరారు. గిరిజనుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలను రాష్ట్ర స్థాయి పండుగ్గా పరిగణించి సాలూరులోనే నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంఘాలు, విద్యార్థులు, మహిళలు ఉత్సవాలకు హాజరయ్యారని చెప్పారు. ఈ ఏడాది సాలూరు, పాచిపెంట మండలాల్లోని తోణాం, నారమ్మకొండ వద్ద నిర్వహించనున్న ఆదివాసీ ఉత్సవాల్లో తాను పాల్గొంటున్నానని రాజన్నదొర చెప్పారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు,పాచిపెంట చినబాబు, సర్పంచులు మువ్వల ఆదియ్య,చింత సీతయ్య, వైసిపి ఎస్టీ సెల్ కన్వీనర్ కొండగొర్రి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

14న జన జాగరణను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కొమరాడ

ఈనెల 14న పార్వతీపురంలో జరిగే జన జాగరణ సంస్కృతిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్వాడీ అండ్ హెల్పర్లు యూనియన్ నాయకులు బి.అలివేలు, పుష్ప, సిఐటియు జిల్లా కమిటీ నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ గురువారం కంభవలస అంగన్‌వాడీ కేంద్రం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోర్కెలు తీర్చడంలో పాటు వారి చట్టాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని, ఇలాంటి సందర్భంలో కార్మిక వర్గమంతా ఏకమై భవిష్యత్తులో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న రాత్రి 12 గంటలకు పార్వతీపురలో జన జాగరణ సంస్కృతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావున అంగన్వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు వర్కర్లు, విఒఎలు, ఆటో డ్రైవర్లు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మన్యం జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్రైం రేటుతో పాటు, ట్రాఫిక్ సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. సమస్యపై వచ్చిన ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ జివి కృష్ణారావు, సిఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్ కుమార్ ఉన్నారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు.

సీతంపేట : స్థానిక పోలీస్ స్టేషన్లను ఎస్పీ ఎస్వి మాధవరెడ్డి సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు సిబ్బందిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌పి వెంట పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు, సిఐ చంద్రమౌళి, ఎస్ఐ జగదీష్ నాయుడు పాల్గొన్నారు.

వాడవాడలా పించన్ల పంపిణీ

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలో ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పంపిణీని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ప్రారంభించారు. గురువారం మున్సిపాలిటీలో 24వ వార్డు సచివాలయం ఎరకల వీధి, 18వ వార్డు సచివాలయం చిన్నకుమ్మరి వీధిలలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే సాలూరు మండలం జీగిరాం, పాచిపెంట మండల కేంద్రం ఎరుకల వీధిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు సజావుగా పంపిణీకి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వాణి, పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని 8995 మంది లబ్ధిదారులకు ఒంటిగంటకే 95 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, టిడిపి నాయకలు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, పల్ల రాంబాబు, గుర్రాన శ్రీరామ్మూర్తి, రెడ్డి బలరామస్వామి, సోములు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని 13,19 వార్డుల్లో అర్హులైన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ

కురుపాం : నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల మంతినివలస, గాంధీనగర్ తదితర వీధుల్లో గురువారం ఉదయం 6 గంటలకే ఎంపిడిఒ ఎస్. అప్పారావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కలిశెట్టి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, టిడిపి నాయకులు కర్రి శ్రీను, పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలోని గడ్డికాలనీ, ఆంజనేయ వీధిలో ఎమ్మెల్యే జగదీశ్వరి లబ్ధిదారులు పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కిషోర్, విఆర్ఒ హరికృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని కోట సీతారాంపురంలో ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు ఆర్.వేణుగోపాలనాయుడు, పెంట సత్యంనాయుడు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ కొట్నాన రామకృష్ణ, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ :మండలంలో నవగాం, అవలంగి, అట్టలిలో చేపట్టిన పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిడిఒ రామకృష్ణ పరిశీలించారు.

కెజిహెచ్‌లో పింఛను అందజేత

మక్కువ : మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ పరిధిలో గల తోటవలసకు చెందిన చప్ప సూర్యనారాయణ పక్షవాతంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. గురువారం స్థానిక సచివాలయంలో విలేజ్ సర్వేయర్ సురేష్ విశాఖ వెళ్లి సూర్యనారాయణకు పింఛన్ డబ్బులు అందజేశారు. దీంతో ఉద్యోగికి కుటుంబ సభ్యులు, అధికారులు అభినందనలు తెలిపారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్

సీతానగరం : మండలంలోని సూరంపేట, మరిపువలసలో పెన్షన్ పంపిణీని కలెక్టర్ ఎం శ్యాం ప్రసాద్ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన పింఛన్ల పంపిణీని 99 శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ, సచివాలయ సిబ్బంది, ఆ గ్రామ సర్పంచ్ సాంబన్న దొర తో పాటు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరంలో లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న కలెక్టర్‌శ్యామ్‌ప్రసాద్

ఏడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్ళి..

సాలూరు: పింఛనుల పంపిణీలో భాగంగా మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో ఉన్న లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులు అందజేశారు. కొదమ పంచాయతీ పరిధిలోని చింతామల, బందపాయి, లొద్ద గిరి శిఖర గ్రామాలకు ఏడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి పంచాయతీ కార్యదర్శి ఎస్.ఎర్రినాయుడు పింఛను డబ్బులు అందజేశారు. ఇంటింటికీ పింఛను డబ్బులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న జిల్లేడువలస పంచాయతీ కార్యదర్శి తిరుమలరావు, బొడ్డపాడు వెళ్లి పింఛను పంపిణీ చేశారు. ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు కాలినడకన గిరి శిఖర గ్రామాల కు చెందిన లబ్దిదారుల కు అందజేశారు.

వికలాంగ విద్యార్థినికి పింఛను అందజేస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

వృద్ధుడికి పింఛను అందజేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

సీతంపేటకు మొదటి స్థానం

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీల సీతంపేట జిల్లాలో మొదటి స్థానం నిలిచిందని ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సీతంపేట మండలంలో 31 సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది 440 క్లస్టర్ లో పెన్షన్ పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. డిఆర్‌డిఎ, ఉపాధిహామీ సిబ్బంది, ఐసిడిఎస్ కోఆర్డినేషన్ తో, పంచాయతీ మండల ప్రజా పరిషత్ సిబ్బంది, మానిటరింగ్ అధికారుల సహకారంతో మండలంలోని 8066 పెన్షన్ దారులకు గాను ఒకటో సాయంత్రం 6 గంటల సమయానికి 7969 పెన్షన్ దారులకు పంపిణీ చేశామన్నారు. జిల్లాలోనే సీతంపేట మండలం పెన్షన్ పంపిణీలో మొదటి స్థానంలో ఉన్నది.

జిసిసి డిపోను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ రాహుల్‌కుమార్‌రెడ్డి

జిసిసి డిపోను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక జిసిసి డిపో, షాపింగ్ కాంప్లెక్స్‌ను ఐటిడిఎ పిఒ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై జిసిసి దృష్టి సారించాలన్నారు. జిసిసి డిపోలో ఉన్న ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. నాణ్యమైన ఉత్పత్తులనే ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో జిసిసి జనరల్ మేనేజర్ జి.సంధ్యారాణి, సీతంపేట, పాతపట్నం మేనేజర్లు దాసరి కృష్ణ, జి.నర్సింహులు, సూపరింటెంట్ పి.ధర్మారావు, ఇతర జిసిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఎంహెచ్‌ఒగా జగన్మోహన్ రావు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

డిప్యూటీ డిఎంహెచ్ఒగా డాక్టర్ టి.జగన్మోహన్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఆయన జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డిఐఒ)గా, జిల్లా మలేరియా అధికారిగా (డిఎంఒ) జిల్లాలో సేవలందించారు. ప్రస్తుతం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయపార్వతి ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ డిఎంహెచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాల ద్వారా మెరుగైన వైద్య సేవలందేలా, సాధించాల్సిన లక్ష్యాలను ముందుకు తీసుకుపోవడానికి కషి చేస్తానని చెప్పారు. జిల్లా ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ పిఎల్ రఘుకుమార్, వైద్యాధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సిఆర్‌టిలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో ఉన్న సిఆర్‌టి ఉపాధ్యాయులకు గురువారం ఐటిడిఎలో డిడి ఎం అన్నదొర ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. 211మంది సిఆర్‌టిలకు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటి, తెలుగు, హిందీ పండితులు, పీడీలు, పిఇటి వివిధ రకాల కేటగిరీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డిడి తెలిపారు. ఈ కౌన్సిలింగ్లో డిప్యూటీ డిఇఒ పి.నారాయుడు, ఎడ్యుకేషన్ సిబ్బంది ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవి, జిసిటిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి - సాలూరు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈనెల 4న పట్టణంలో గిరిజన సంఘాలు నిర్వహించబోయే ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని సంఘాల నాయకులు ఆహ్వానించారు. గురువారం మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈనెల 4న పట్టణంలో ఉన్న సెయింట్ పాల్ కమ్యూనిటీ హాలులో గిరిజన సంఘాలు ఆదివాసీ ఉత్సవాలను నిర్వహించనున్నాయి. ఈ ఉత్సవాలకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర లకు కూడా ఆహ్వానించారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఎమ్మెల్యే హర్షం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఎస్సీ ఉప వర్గీకరణతో అందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. ఉప వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఉప వర్గీకరణ జరిగినప్పుడే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని ఆర్థిక, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని ఎమ్మెల్యే అన్నారు. ఐఎఎస్, ఐపిఎస్ వంటి ఉన్నత ఉద్యోగాల్లోనూ అందరికీ సమన్యాయం జరుగుతుందని, ఎక్కువ మంది ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ ఉప వర్గీకరణపై మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు ఆనందం వ్యక్తం చేశారు

పింఛన్ల సొమ్ము స్వాహాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

చనిపోయిన వారి పింఛను సొమ్మును స్వాహా చేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు కోలక అవినాష్ కుమార్, కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సోషల్ ఆడిట్‌లో నీలకంతాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 39మంది చనిపోయిన వారికి డిబిటి ద్వారా రూ.6లక్షల93వేలు మరణించిన తర్వాత కూడా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇద్దరు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.36వేలు, అలాగే మృతి చెందిన తర్వాత 16మంది పింఛనుదారులకు రూ.4లక్షల 52వేలు నేరుగా డ్రా చేశారని, సామాజిక తనిఖీలో గుర్తించినట్టు తెలిపారు. అక్రమాలకు పాల్పడ్డ వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఉపాధి వేతనాలు చెల్లించాలని గిరిజన సంఘ నాయకులు ఎంపిడిఒ గీతాంజలి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీతంపేట మండలంలో ఉపాధి కూలీలకు 11 వారాల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. వేతనాలు చెల్లించి ఉపాధి కూలీలను ఆర్థిక ఇబ్బందులు నుండి ఉపశమనం కల్పించాలని వారు కోరారు. వినతిని అందజేసిన వారిలో గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, బి.అప్పారావు, జె.శ్రీరాములు ఉన్నారు.

చిన్నమంగళాపురం పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని చిన్నమంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు యూనిఫారాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయో, ఏ విధంగా విద్యా బోధన అందిస్తున్నారో అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి 500మార్కులకు తగ్గకుండా రావాలన్నారు. ఎన్‌ఎంఎంఎస్ కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షల నిర్వహించే కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా కంటి పరీక్షలు ప్రారంభించినట్లు జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయ పార్వతి పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యాధికారులు, సహాయకులు పాల్గొంటారన్నారు. గురువారం జిల్లాలో సాలూరు, కురుపాం, పాలకొండ, తాడికొండ, పాచిపెంట, సీతంపేట, గరుగుబిల్లి మండలాలల్లో గల పాఠశాలల్లోనేత్ర పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్ళజోల్లు పంపిణీ చేస్తామని, అలాగే నేత్రాలకు సంబంధించి ఎటువంటి శస్త్ర చికిత్సలు (మెల్లకన్ను, గాయాల వలన వచ్చే కేటరాక్ట్) అవసరమైతే వారికి ఉచితంగా ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయనున్నట్లు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు.

బూర్జిగూడలో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధారపాడు సచివాలయం పరిధిలో ఉన్న బూర్జుగూడలో సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ ఆధ్వర్యంలో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఇంటి బయట, లోపల దగ్గరుండి స్ప్రేయింగ్ చేయించారు. స్ప్రేయింగ్ చేయడం వల్ల కలిగిన లాభాల గురించి సర్పంచ్ వివరించారు. సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు మాట్లాడుతూ స్ప్రేయింగ్ దోమల నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జ్వరాలపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామాల్లో అన్ని ఇళ్లల్లో స్ప్రేయింగ్ చేశామని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి అన్నపూర్ణ, ఎపిఎం విజయ కుమారి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

గోతులను పూడ్చండి

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

మండలంలోని అంతర్రాష్ట్ర రహదారి అయినా తోటపల్లి - గుణుపూర్ ఆర్ అండ్ బి రహదారి పనులు కొంతవరకు పూర్తయినప్పటికీ పెదమేరంగి కూడలిలో చేయాల్సిన పనులను గత ప్రభుత్వం విడిచిపెట్టడంతో అక్కడ రహదారిపై గోతులు చెరువులను తలపిస్తున్నాయని. వీటిని పూడ్చాలని సిపిఐ నాయకులు టి.జీవ, సూరయ్య డిమాండ్ చేశారు. గురువారం వారు పెదమేరంగి కూడలిలో నిరసన చేపట్టి ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే రహదారి పెండింగ్ పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

సేవలకు సత్కారం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా, వృద్ధమిత్ర కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తిని స్థానిక రైతు బజార్ దగ్గర ఉన్న నిరాశ్రయుల వసతిగృహంలో ఐఆర్‌పి డబ్ల్యుఎ డైరెక్టర్ పికె ప్రకాష్, రెడ్‌క్రాస్ చైర్మెన్ మంచిపల్లి శ్రీరాములు, వైద్యులు డాక్టర్ యాళ్ల వివేక్, రెడ్ క్రాస్ సభ్యులు జనార్దన్, శ్రీనివాసురావు, తదితరులు దుస్సాలువతో సత్కరించి, మెమోంటోను బహుకరించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణమూర్తి ప్రతి నెలా తన జీతంలో కొంత డబ్బుతో ఎందరో నిరాశ్రయులకు, వృద్ధులకు, పేదలకు, విద్యార్థులకు చేస్తున్న సేవలకు మెచ్చి సన్మానించినట్టు తెలిపారు. కష్టంలో ఉన్న వారిని గుర్తించి ప్రతి నెలా వారికి ఎంతో సహాయ సహకారాలు అందజేస్తున్న కృష్ణమూర్తి పలువురికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిరాశ్రయుల వసతి గృహ సిబ్బంది గణేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తిని సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

తల్లిపాలతో పిల్లలకు మేధస్సు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో తల్లి పాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి ప్రపంచ తల్లిపాల వారోత్సవాల గోడపత్రికను గురువారం జిల్లా ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈనెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో బాలింతలకు, గర్భిణీలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వారం అంతా జిల్లా వ్యాప్తంగా 37 పి.హెచ్.సిలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, 3 సి.హెచ్.సిలు, 3 ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రిలో ఆయా పరిధిలోని ఉపకేంద్రాలు, గ్రామాల్లో వైద్య సిబ్బంది, డాక్టర్లు అవగాహన కల్పిస్తారని తెలిపారు. తల్లిపాల వల్ల ఉపయోగాలు తెలిపారు. మొదటి 6 నెలలు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణాహారమని, తల్లిపాలు శిశువుకు న్యూమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి రక్షిస్తుందని, పిల్లల మేధస్సు మెరుగు పరుస్తుందని, తల్లీబిడ్డల మధ్య బంధాన్ని పెంచుతుందని అన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం వల్ల వచ్చే అవకాశాలు తక్కువ అని, తల్లి పాలిచ్చే తల్లుల్లో రొమ్ము, గర్భాశయం, అండాశయ కేన్సర్ ప్రమాదం తక్కువని, పిల్లల మరణాలు తగ్గుదల ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, డిఐఒ డా. నారాయణ, వైద్యాధికారులు టివై విజయ మోహన్, డాక్టర్ లావణ్య, పిపి యూనిట్ వైద్యాధికారులు, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డెమోలు సన్యాసిరావు, యోగీశ్వరరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ జయ గౌడ్, ఎంపిహెచ్ఎస్ (ఎఫ్) పుష్ప తదితర సిబ్బంది

పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఎంహెచ్‌ఒ విజయపార్వతి

పాల్గొన్నారు.

గరుగుబిల్లి: తల్లి పాల వారోత్సవాలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయడానికి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మండలంలో ఉన్న ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి సూపర్వైజర్లు చిన్నమ్మి, ఉదయకుమారి, ప్రసాద్, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి :ఎమ్మెల్యే

ప్రజాశక్తి -భామిని

బాలికలు బాల్య వివాహాలకు నిరాకరించాలని, మంచి లక్ష్యం పెట్టుకుని, క్రమశిక్షణ తో చదివి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ అన్నారు. గురువారం భామినిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్న అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. బాలికల తల్లిదండ్రులు ఆశయ సాధన దిశగా చదువు కొనసాగించాలని కోరారు. అనంతరం ఘనసర వద్ద వంశధార కుడి కాలువకు ఆనుకుని ఉన్న హెడ్ రెగ్యులేటర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం పాడైందని, మరమ్మతులు చేపట్టాలని స్థానిక రైతులు కోరారు. ఈ హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఘనసర, కొసలి, కీసర, తలడా గ్రామాల వ్యవసాయ భూములకు సాగు నీరు అందుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బి.రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన్ జగదీశ్వరరావు, నాయకులు భూపతి ఆనందరావు, బిడ్డికి ప్రసాద్, సాకేటి రామారావు, గురిబిల్లి లక్ష్మీపతి, లోపింటి రాజేష్, కోరాడ రాజేష్, కొల్ల మధు, కోరాడ రవణ, సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ప్రభుత్వం అందిస్తున్న విద్యావకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని వారి జీవితాలను ఉన్నతంగా తీర్చుదిద్దుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బి.విజయ్ చంద్ర అన్నారు. గురువారం స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన నోట్ పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఉద్యోగం సంపాదించి వారి కుటుంబమంతా ఆర్థికంగా నిలదుక్కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. టిడిపి హయాంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస :మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి కళాశాలకు ఆదర్శంగా నిలవాలని మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆకాంక్షించారు. ఇంటర్ విద్యార్థులకు గురువారం ఆయన పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో విద్యనభ్యసిస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రశంసించారు. అనంతరం కళాశాల సిబ్బంది విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇచ్చేలా బోధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమణ, లెక్చరర్లు మహారాణి, రాధాకష్ణ ,కల్పన, కష్ణమూర్తి , సిబ్బంది పాల్గొన్నారు.

విజయచంద్రను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఎమ్మెల్యేకు విశ్వబ్రాహ్మణుల సన్మానం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలో గల ప్రైవేటు కళ్యాణ మండపంలో స్థానిక ఎమ్మెల్యే విజయచంద్రను శ్రీ పార్వతీదేవి కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులవత్తుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నాయని, కుల వత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. తన వంతుగా ఆయా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐ టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ బార్నాల సీతారాం, టిడిపి సీనియర్ నాయకులు గొట్టపు వెంకటనాయుడు, కోలా మధు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గుండ్రెడ్డి రవికుమార్, మజ్జి వెంకటేష్, 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్, సీటు బెల్టుపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలి

ప్రజాశక్తి - కురుపాం

వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని బ్రేక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక కోర్టు సమీపంలో రహదారి భద్రతపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఆటోలో కుడి వైపు కూర్చోకుండా మధ్యలోనే కూర్చోవాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, అలాగే ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పైడితల్లి, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరిరావు సిబ్బంది పాల్గొన్నారు. చేయక పోవడం వల్ల రైతులు నష్టపోయారని, కావున ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్ పేట చెక్ పోస్టు వద్ద ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. పార్వతీపురం, కురుపాం, ఒడిశా ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే లారీలు, ఆటోలు, మోటార్ సైకిళ్లను నిలిపి పరిశీలించారు. లైసెన్స్, అనుమతి పత్రాలు, హెల్మెట్ లేనివారికి అపరాధ రుసుం వేశారు. కొత్త వ్యక్తులను ప్రశ్నించి వివరాలను అడిగి తెలుసుకుని విడిచిపెట్టారు. జులై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గ మంతటా ఎక్కడికక్కడ వాహన తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంఇఒ డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావుకు యుటిఎఫ్ మండల నాయకులు వినతిని అందజేశారు. జిఒ 117 రద్దు చేయాలని, ఫ్రీ ప్రైమర్‌తో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులకు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని, హైస్కూల్లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. పని భారం తగ్గించాలని, హైస్కూల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటరుకు పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితిని బట్టి మధ్యాహ్న భోజన పథకం సవరించాలని తదితర అంశాలపై వినతిని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఎస్.రాజకుమారి, ఎం.పైడిరాజు, బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, కె.స్వామిబాబు, కె.గౌరునాయుడు, ఎస్.విశాలాక్షి, ఎస్.సునీతనాయుడు, వి.అన్నాజీరావు, కె.కవితి, వి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

8న ఎస్‌ఎంసి ఎన్నికలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఈ నెల 8న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్‌ఎంసి) ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి పాఠశాలల వారీగా సంబంధిత హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేసి అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్ గురువారం నోటీసు బోర్డులో అంటించామన్నారు. ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఎన్నికల అధికారిగా పాఠశాల హెచ్‌ఎం వ్యవహరిస్తారని, ఈనెల 8న ఓటింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

సీతానగరం : మండలంలోని రామవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నికకు ఈరోజు నోటిఫికేషన్ ప్రధానోపాధ్యాయులు బి. ప్రసాద రావు జారీ చేశారు. ని ఓటర్లైన తల్లిదండ్రులంతా ఎన్నికలో తప్పనిసరిగా పాల్గొని ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సహోపాధ్యాయులు వి. తవిటినాయుడు, కె.లక్ష్మీనారాయణ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొమరాడ :మండలంలోని పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఇఒ జామి నారాయణస్వామి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను అంటించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు 127 ఉన్నాయని, వీటన్నింటికీ ఈనెల 8న ఎన్నికలు జరుగుతాయన్నారు.

వీరఘట్టం : పిఎంసి ఎన్నికలను సమిష్టిగా నిర్వహించాలని ఎంఇఒ- 2 ఆర్.ఆనందరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , సిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పైల సత్యనారాయణ, చిప్పాడ సుబ్బయ్య విలేకరులతో మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సంక్షేమ బోర్డ నిధులు రూ.2వేల కోట్లు సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలని నారాయణపురం, అరసాడ, అంపావల్లిలో ఇసుక రీచ్‌లకు పాయింట్లుకు అవకాశం ఇవ్వాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం, పెండింగ్ క్లైములు పరిష్కారం చేయాలని, గుర్తింపు ఇప్పటికే సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులకు విశ్వకర్మ యోజన అమలు చేయాలని, గత రాష్ట్ర ప్రభుత్వ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సంక్షేమ బోర్డును సమర్థ వంతంగా నిర్వహించాలని, ఉపాధికి నష్టం చేసే మెమో 12,13 లను రద్దు చేయాలని, తమ డబ్బు రూ.2వేల కోట్లు బోర్డుకు జమ చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో కమిటీ సభ్యులు చక్రధర్, కృష్ణ, మజ్జి, మురళి తదితరులు పాల్గొన్నారు

న్యాయం చేయాలంటూ వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తనను నమ్మించి మోసగించిన యువకుడి నుంచి న్యాయం చేయాలని కోరుతూ నేరుగా ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లి ఓ మహిళ బ్లేడుతో మెడతో పాటు శరీరంపై గాయపర్చుకొని కలకలం సష్టించిన సంఘటన గురువారం పార్వతీపురంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని విజయరామరాజు కాలనీకి చెందిన వంగర సత్య కూలిపని చేసుకొంటూ జీవనం సాగిస్తుంది. ఆమె భర్త జగదీశ్వరావు మూడేళ్ల క్రితం చనిపోయాడు. కుమారుడు రాఘవ మూడో తరగతి చదువుతున్నాడు. ఏడాది నుంచి పార్వతీపురం సారిక వీధికి చెందిన పవన్‌కుమార్

చికిత్స పొందుతున్న సత్య

ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి తనతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలని కోరగా అతను నిరాకరించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె చనిపోవాలనే ఉద్దేశంతో బ్లేడ్ తీసుకొని రాయగడ రోడ్డులో గల విజయలక్ష్మి కల్యాణ మండపంలో జరుగుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశానికి వెళ్లిన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర సమీపంలో బ్లేడుతో గొంతు, చేతులు కోసుకుని గాయపర్చుకుంది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఈ విషయాన్ని తెలపగా గాయాలతో ఉన్న ఆమెను వెంటనే ఎమ్మెల్యే జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పట్టణ పోలీసులు ఈ సంఘటనపై విచారణ చేస్తున్నారు.

సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కంబవలస పంచాయతీ సర్పంచ్ అంబటి లక్ష్మి కుటుంబ సభ్యులను కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి పరామర్శించారు. సర్పంచ్ అంబటి లక్ష్మి భర్త శంకరరావు మరణ వార్త తెలుసుకొని రాజ్యలక్ష్మీపురంలో సర్పంచ్ ఇంటికి వచ్చి ఎమ్మెల్యే ఓదార్చారు. భర్త శంకర్రావు ఉపాధి హామీ పథకంలో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తూ మంచి పేరు పొందిన వ్యక్తిగా ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం సర్పంచ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, నంగిరెడ్డి మధుసూధనరావు, దేవకోట వెంకట నాయుడు, సర్పంచ్ లక్ష్మణరావు, మజ్జి కిరణ్ కుమార్, అధికారి రాజశేఖర్, ఉడతలు సత్యం తదితర నాయకులు పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎఇ బి.శంకరరావు అన్నారు. ఈ మేరకు విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్వహణ పనులతో పాటు ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేస్తున్న విద్యుత్తు లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలను తొలగిస్తామన్నారు. నిర్వహణ పనుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్న నేపథ్యంలో వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని శంకరరావు తెలిపారు.

గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పాలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచి బి.గౌరీశంకరరావు పనిచేస్తున్నారు. పిన్నవయసులోనే సర్పంచ్ గా ఎన్నికైన గౌరీ శంకర్ రావు ప్రజాసేవే పరమావధిగా ప్రజలకు అందిస్తున్నారు. 2021లో రెండోసారి సర్పంచిగా ఎన్నికైన ఆయన గ్రామంలో విద్యుత్ దీపాలు, తాగునీరు, డ్రైనేజీ అభివృద్ధి పనుల్లో నిత్యం కనిపిస్తున్నారు. మరోవైపు గ్రామంలో ఎవరికైనా ఆపద వస్తే ముందుగానే స్పందించి తోచిన సాయం అందిస్తూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. సర్పంచి సేవలను గ్రామస్తులు కొనియాడుతున్నారు.

నిలిచిన గ్రామీణ బ్యాంకు సేవలు

ఖాతాదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక విశాఖ గ్రామీణ బ్యాంకు యుపిఐ, ఎఇపిఎస్ సేవలు గత నాలుగు రోజులుగా నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 30 బ్యాంకుల ఇంటర్నెట్ సేవలు ఆగిపోవడం, అందులో భాగంగానే గ్రామీణ బ్యాంక్ సేవలు కూడా పనిచేయడం లేదని ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల నుంచి ప్రతిరోజు వందలాది మంది ఖాతాదారులు బ్యాంక్ సేవలు వినియోగించుకొనేందుకు వస్తున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సిపిఎం నాయకుడికి జనసేన పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ సిపిఎం నాయకులు కె.గౌరీశ్వరరావును జనసేన నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గాయం తగ్గేంత వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు,డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్వగ్రామం ఎం.రాజపురంలో గురువారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఉద్యోగులు, పింఛనుదారులు ఘనంగా సన్మానించారు. వీరఘట్టంలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి రెండేళ్ల కాలం అవుతుందని వాటిని యధావిధిగా పెట్టేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం నియోజకవర్గ మాజీ ఇన్చార్జి నిమ్మక పాండురంగ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డి.శ్రీబాబు విగ్రహ కమిటీ అధ్యక్షులు డి.ప్రకాశరావు, జిల్లా బాధ్యులు ఎ.రాంకుమార్, కె.విజయ్‌కుమార్, కె. కే గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో
OS 168/2023

Between :-
వెలగల బాపిరెడ్డి ....వాది
And :-
పెనుగుర్తి దాలయ్య ......ప్రతివాది
To,
పెనుగుర్తి దాలయ్య S/o గుంపస్వామి, వ్యాపారం, వ్యవసాయం, కుమ్మరివీధి, పంచాళి గ్రామం, పాచిపెంట మండలం, విజయనగరం జిల్లా, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో వివరించిన ప్రాంశరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం, పై నెంబరు దావాను మీ పై వాది దాఖలు చేసియున్నారు. మీరు బుద్ధిపూర్వకంగా కోర్టువారు జారీ చేసిన నోటీసులు తీసుకొనందున, యీ ప్రకటన ద్వారా మీకు తెలియజేయవలసినదిగా కోర్టువారు ఆర్డరు వేసియున్నారు. పై నెంబరుదావా తే **20-08-2024**దీకి వాయిదా అయ్యియున్నది. కావున వాయిదా తేది **ఉదయం 10-30 గంటల**కు పై కోర్టులో స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు వ్రాతపూర్వకంగా కోర్టువారికి తెలియచేసుకోనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానం చేయబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

//కోర్టువారి ఆర్డరు ప్రకారం//

మురళీధర్ పాఢీ
వాది తరుపు న్యాయవాది,
సాలూరు

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో
OS 168/2023 IA 249/2023

Between :-
వెలగల బాపిరెడ్డి ....పిటీషనరు/వాది
And :-
పెనుగుర్తి దాలయ్య ......రెస్పాండెంటు/ప్రతివాది
To,
పెనుగుర్తి దాలయ్య S/o గుంపస్వామి, వ్యాపారం, వ్యవసాయం, కుమ్మరివీధి, పంచాళి గ్రామం, పాచిపెంట మండలం, విజయనగరం జిల్లా, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా.

మీ పై యిందలి పిటీషనరు/వాది గారు దావా ప్రాంసరి నోటు బాకి రాబట్టు నిమిత్తం, పై నెంబరు దావా మరియు I.A 249/2023 గా యీ దిగువ షెడ్యూలు దాఖలాస్తిని ప్రథమ జప్తు కోరుతూ దాఖలు చేసియున్నారు. సదరు దావా మరియు IA 249/2023 **తే 20-08-2024దీ**కి వాయిదా అయ్యియున్నది. కావున వాయిదా తేది **ఉదయం 10-30 గంటల**కు పై కోర్టులో స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు మరియు సదరు దావా బాకీకి సరిపడు సెక్యూరిటీ సమర్పించుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

జిల్లా :- విజయనగరం, ప్రస్తుతం పార్వతీపురం మన్యం, **మండలం :-** పాచిపెంట, **గ్రామం :-** పంచాళి, **ఆస్తి వివరము :-** మెట్టు భూమి, **ఖాతా నెంబరు :-** 130, S.No-113-1, విస్తీర్ణం 0-50 సె॥ లేక 0-200 హెక్టార్లు. **హద్దులు :- తూర్పు :-** ఆమిటి అప్పన్న మెట్టు భూమి, **దక్షిణ :-** పంచాళి శ్యామల కుమారి మెట్టు భూమి, **పడమర :-** గోర్జ రస్తా, **ఉత్తర :-** దండి సూర్యకళ గారి మెట్టు భూమి,

వాది విలువ :- 5,00,000/-

మురళీధర్ పాఢీ
పిటిషనరు/వాది తరుపు న్యాయవాది,
సాలూరు